ఆహార భద్రతపై ఆశలు

- ప్రజాపాలనలో అనధికారికంగా రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ
- కొత్త కార్డుల కోసం ఎదురు చూపులు
- ప్రతి పథకానికి రేషన్ కార్డు లింకే కారణం
- జిల్లాలో గతంలో 95,040 రేషన్ దరఖాస్తులు రిజక్ట్


సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన సభల్లో అభయ హస్తం దరఖాస్తులతో అనాధికారికంగా కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులను స్వీకరించడంతో ఆహార భద్రత కార్డులపై అర్హులైన పేదల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్(ఆహార భద్రత)కార్డులను మంజూరు చేయకపోగా, 2016 సంవత్సరంలో ఉన్న రేషన్ కార్డుల నుంచి 90,040 రేషన్ కార్డులను వివిధ కారణాల చూపుతూ.. రద్దు చేసింది. అయినా కలెక్టరేట్‌తో సహా జిల్లాలో ఆర్డీఓ, ఎంపీడీఏ తదితర కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో రేషన్ కార్డుల కోసం వెల్లువలా దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. నిరంతర ప్రక్రియగా ప్రజలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ప్రధాన కారణం ప్రతీ సంక్షేమ పథకానికి లింకు పెట్టడమేనని తెలుస్తోంది.

అనధికార దరఖాస్తుల స్వీకరణతో పెరిగిన ఆశలు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎనుముల రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రజాపాలన సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభల్లో కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన అంశం లేకపోయినా ప్రజల డిమాండ్‌కు అనుగుణంగా అనాధికారికంగా దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డులకు సంబంధించి ప్రజాపాలన కార్యక్రమం ద్వారా జిల్లా పౌరసరఫరాల శాఖకు 34,453 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమం ముగిసే వరకు మరో 1.50 లక్షల దరఖాస్తులు రాగలవని సంబంధిత అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలాగే, రేషన్ కార్డుల్లో మ్యుటేషన్(చేర్పులు, మార్పులు)కు సంబంధించి 71 వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

కార్డుల రద్దుకు అప్పట్లో చూపిన కారణాలివే..

రేషన్ కార్డుల రద్దుకు సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం చూపిన కారణాల్లో ప్రధానంగా



ఉపాధి కోసం ప్రజలు వేర్వేరు ప్రాంతాలకు వలస వెళ్లటం.. కుటుంబంలో ఆడపిల్ల వివాహం తర్వాత ఆమె పేరు తొలగించకుండా ఉండటం.. మృతిచెందిన వారి కూడా పేర్లు తొలగించకపోవడం వంటివి పేర్కొంది. ఈ కారణాలతో 2016లో అప్పటి ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ 90,040 రేషన్ కార్డులు రద్దు చేసింది. అప్పటి నుంచి ఆయా రేషన్ కార్డుల లబ్ధిదారులకు నెలవారీగా రేషన్ సరకులు అందడం లేదు. దీంతో నిరుపేద లబ్ధిదారులు ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాలు, ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అయినా బీఆర్ఎస్ ప్రభుత్వం స్పందించకపోవడంతో.. కొందరు లబ్ధిదారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానం వాటిని మరోసారి పరిశీలించాలని సూచనలిచ్చింది. దీంతో రద్దుచేసిన రేషన్ కార్డు దారుల నుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిశీలించాలని సంబంధిత అధికారులను అప్పటి ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం రేషన్ కార్డుల పునరుద్ధరణకు సంబంధించి సర్వే ప్రక్రియ చేపట్టినా, సకాలంలో పూర్తి చేయలేకపోయింది.

రద్దయిన కార్డులిక్కడే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 95,040 తెల్లరేషన్ కార్డులు రద్దు కాగా, మండలాలు, జీహెచ్ఎంసీ మున్సిపల్ సర్కిళ్ల వారీగా రద్దయిన తెల్ల రేషన్‌కార్డుల వివరాలు ఇలా ఉన్నాయి. బాచుపల్లి మండలంలో 2,378 తెల్లరేషన్ కార్డులు రద్దు కాగా, ఘట్‌కేసర్‌లో 2,273, కాప్రాలో 2,263, కీసరలో 3,388, మేడ్చల్‌లో 2,306, మేడిపల్లిలో 4,165, శామీర్‌పేట్‌లో 893, మూడు చింతలపల్లి మండలంలో 328 రేషన్ కార్డులు రద్దయ్యాయి. ఉప్పల్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 39,270, బాలానగర్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో 35,210 తెల్ల రేషన్ కార్డులు రద్దయ్యాయి.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సావిత్రిబాయి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రామేశ్వర్‌గౌడ్

కీసర: పీఆర్‌టీయూటీఎస్ కీసర శాఖ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి విగ్రహానికి పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ ఆనంద్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో కీసర మండల అధ్యక్షుడు జేపీఆర్ విఠల్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ యాదగిరి, రాష్ట్ర బాధ్యులు జి.చంద్రారెడ్డి, చంద్రశేఖర్, ప్రవీణ్‌రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్, మండల బాధ్యులు స్వరాజ్యలక్ష్మి, బాలమణి, శశిరేఖ, సుధాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలాలను కాపాడాలని వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మేడ్చల్‌రూరల్: మండలంలోని రావల్‌కోల్ గ్రామంలోని పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని సీపీఎం మండల కార్యదర్శి నరేశ్ మేడ్చల్ తహసీల్దార్ శైలజకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసిన సీపీఎం మండల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలోని జీపీఆర్ సెక్టర్–3లోని పార్కు స్థలాలను కొంతమంది కబ్జా చేసి ఇతరులకు యథేచ్ఛగా అమ్ముకుంటున్నారని, గ్రామ పంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని, వెంటనే కబ్జాదారులపై చర్యలు తీసుకుని పార్కు స్థలాలను కాపాడాలని కోరారు.

అన్నోజిగూడలో రామయ్య అక్షింతల వితరణ



అక్షింతర వితరణలో చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం అయోధ్య రామయ్య అక్షింతల వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికీ అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ వేమనరెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు బిక్కునాథ్ నాయక్, నాయకులు చిన్న నర్సింహులు గౌడ్, శంకర్ గౌడ్, కేఎం రెడ్డి, రాధారం యాదగిరి, నల్లవెల్లి రమేష్, సత్యం, సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం



మేడ్చల్‌రూరల్: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి అత్వెల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను సన్మానించి విద్యార్థులకు ఆమె జీవిత విశేషాలను వివరించారు. హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు గడప నవీన్, పద్మలత, స్వరూపదేవి, ఉమాభారతి, శ్రీదేవి, మంజుల, రేణుక, సోని, జ్యోతి, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీనగర్ కాలనీ అభివృద్ధికి సహకారం అందజేస్తా

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీ అభివృద్ధికి సహకారం అందజేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి వారు ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సత్కరించారు. కాలనీ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం హెచ్‌బీ కాలనీ తిరుమలనగర్ కాలనీ సంక్షేమసంఘం నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షుడు రాంమోహన్ రావు, కృష్ణమోహన్, కోటిరెడ్డి, జి.రాంరెడ్డి, బీఎస్ఆర్ మూర్తి, బి.శ్రీనివాస్, యాదవరెడ్డి, కామేశ్వరరావు, రాజేశ్వరరావు, సుబ్బారెడ్డి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, నిస్సార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యను మెరుగుపర్చండి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లో నీటి సమస్యను మెరుగుపర్చాలని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ బుధవారం జలమండలి జీఎం సునీల్‌కుమార్‌ను కలిసి కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూనగర్‌లో ఎత్తు ప్రాంతంలో నీటి కనెక్షన్లు ఇచ్చినా నీరు సరఫరా చేయలేదని, అయినా నీటి బిల్లులు వచ్చాయని వాటిని రద్దు చేసి బూస్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కోరారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో ఉన్న పవర్ బోర్లకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన జీఎం సునీల్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల భిక్షాటన

మల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని బీఆర్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. బుధవారం నాచారంలోని ఆటో డ్రైవర్ దొంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాచారం నుంచి హబ్సిగూడ చౌరస్తా వరకు ఆటో డ్రైవర్లు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత బస్సుతో ఆటోలకు కిరాయి లేకపోవడంతో డ్రైవర్లు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పాండునాయక్, రాష్ట్ర కార్యదర్శి చిన్నం బాలనరసింహ, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హైమద్‌బాయ్, రవి, పరుశురాం, రమేష్, హజర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని నిర్మాణం కూల్చివేత

అల్వాల్: నిబంధనలు అతిక్రమించి జరుగుతున్న నిర్మాణాలపై అల్వాల్ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం వెంకటాపురం ప్రధాన రహదారిలోని నిర్మాణాన్ని కూల్చివేశారు. మాస్టర్ ప్లాన్‌కి విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారని, ఈ విషయమై నోటీసులు సైతం జారీ చేసినా స్పందన రాకపోవడంతో చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. కాగా సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వందల సంఖ్యలో నిర్మాణాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు కేవలం కొందరి ఒత్తిడి కారణంగా 40 గజాల స్థలంలో నిర్మాణాన్ని కూల్చి వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పేలుళ్లపై లభ్యం కాని ఆధారాలు

బాధ్యులను శిక్షించాలంటున్న వెంకట్‌రెడ్డినగర్ వాసులు



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: చర్లపల్లి, వెంకట్‌రెడ్డినగర్ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలో జరిగిన పేలుళ్లపై ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని పోలీసులు అంటున్నారు. బాధ్యులను గుర్తించి ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని వెంకట్‌రెడ్డినగర్, మధుసూదన్‌రెడ్డినగర్ కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. పేలుడు ఘటనపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాలనీలను సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరుపై స్థానికులతో మాట్లాడారు. ప్రమాదానికి కారణమైన వారిని గుర్తించాలని పోలీసులను ఆదేశించారు. డ్రైనేజీలో కెమికల్స్ వదలడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్పష్టమైనప్పటికీ బాధ్యులను గుర్తించలేకపోతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సమీపంలోని పరిశ్రమల నుంచే వచ్చిందా.. బయట వ్యక్తులు ఎవరైనా వ్యర్థ కెమికల్స్‌ను డ్రైనేజీలో వదిలి వెళ్లి ఉంటారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై ఎస్ఐ శేఖర్‌ను వివరణ కోరగా ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. బయట వ్యక్తులే కెమికల్స్‌ను వదలి ఉంటారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎలాంటి ప్రాణహాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకుంటున్నాం, కానీ జరగరానిది జరిగితే మా పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ఉండాలంటే బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన శ్రీకాంత్‌యాదవ్



జవహర్‌నగర్: నూతన సంవత్సరం పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ బుధవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకాంత్‌యాదవ్‌ను ఆప్యాయంగా పలకరించి పలు విషయాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు ప్రతి కుటుంబానికీ అందేలా కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు రాజుయాదవ్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన హరివర్ధన్‌రెడ్డి



మేడ్చల్‌రూరల్: సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి కలిశారు. సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నేటి నుంచి సదరం క్యాంపు

ఘట్‌కేసర్: మల్కాజ్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ బోర్డు ద్వారా నిర్వహించనున్న సదరం క్యాంపును మండలంలోని వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అరుణ తెలిపారు. 4న ఆర్థోపెడిక్, వినికిడి, కంటి చూపు, 11న ఆర్థోపెడిక్, మానిసిక వికలాంగులు, మానసిక జబ్బులు ఉన్నవారు, 18న ఆర్థోపెడిక్, వినికిడి, కంటి చూపు, 25న ఆర్థోపెడిక్, మానసిక వికలాంగులు, మానసిక జబ్బులు ఉన్నవారు హాజరు కావాలన్నారు. మీ సేవా ద్వారా బుక్ చేసుకున్న సదరం స్లాట్, ఆధార్ కార్డు, సర్టిఫికేట్, ఫొటో, మెడికల్ రిపోర్ట్స్ వెంట తీసుకొని ఆయా తేదీల్లో మాల్కాజ్‌గిరి ప్రభుత్వ ఆస్పత్రిలో ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



అల్వాల్: ఓల్డ్ అల్వాల్‌లోని అతి పురాతనమైన శ్రీగుండం బాలాజీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు స్వామి వారి యాగం నిర్వహించి పల్లకి సేవలో ఊరేగించారు. కార్యక్రమంలో యజ్ఞాచార్యులు సంపత్‌కుమార్ ఆచారి, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మాధవాచార్యులు, కృష్ణమాచార్యులు, శ్రీధర్, రాము, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అవుషాపూర్ విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ ఎన్నిక

ఘట్‌కేసర్: అవుషాపూర్ విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సానాల వీరాచారి, గౌరవ అధ్యక్షుడిగా అంజయ్యచారి, ఉపాధ్యక్షుడిగా విష్ణుమాచారి, ప్రధాన కార్యదర్శిగా నర్సింహచారి, కోశాధికారిగా ఆచారి, సలహాదారులు నర్సింహచారి, ప్రభాకర్‌చారిని ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు వీరాచారి ఆధ్వర్యంలో స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం మండల మాజీ అధ్యక్షుడు బైరోజు బాబుచారి, సంతోశ్‌చారి, బ్రహ్మయ్యచారి, నాగార్జున, నాగారాజు, వెంకటాచారి, రాజుచారి, గణేశ్‌చారి, రవి, సుధాకర్‌చారి పాల్గొన్నారు.



వీర బ్రహ్మేంద్రస్వామిని దర్శించుకుంటున్న నూతన అధ్యక్షుడు వీరాచారి, కమిటీ సభ్యులు

చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకా వేయించాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: చిన్నారులందరికీ వ్యాధి నిరోధక టీకా వేయించాలని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని 16వ వార్డు బస్తీ దవాఖానాలో ఏర్పాటు చేసిన చిన్నారుల వ్యాధి నిరోధక టీకా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకా ఇన్ఫెక్షన్ రాకముందే హానికరమైన వైరస్, బ్యాక్టీరియాను గుర్తించి వాటి నుంచి మనల్ని రక్షిస్తుందన్నారు. అలాగే శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచి అంటువ్యాధులు వచ్చే అవకాశాన్ని తగ్గిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు, ఆశ వర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.



టీకాను పర్యవేక్షిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలి

మల్కాజిగిరి: వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం బాలసరస్వతీనగర్‌లో షాదన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికీ పేద, మధ్య తరగతి ప్రజలు వైద్య సేవలు పొందడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం అర్హులైన వారికి ఆరోగ్యశ్రీ కార్డులు అందజేయాలన్నారు. వైద్యం విలువ తెలియడంతోనే తల్లి పేరున అరుంధతి ఆస్పత్రి ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, డాక్టర్లు షాదిక్, నస్రిన్, జయరాజ్‌తో పాటు ఉపేందర్ లక్ష్మణ్ రావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టండి



బలరాంనగర్‌లో నాలాను పరిశీలించిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బుధవారం విస్తృతంగా పర్యటించారు. దొడ్లబస్తీ, బలరాంనగర్ ప్రాంతాల్లో నాలాను పరిశీలించి స్థానికుల నుంచి సమస్య తెలుసుకున్నారు. డీసిల్టింగ్ సరిగా చేయకపోవడంతో తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. బలరాంనగర్‌లో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినడంతో తరచూ మురుగునీరు రోడ్డుపై పారుతుండటమే కాకుండా దుర్గంధమైన వాతావరణం ఏర్పడుతోందని వివరించారు. తాత్కాలికంగా డ్రైనేజీ వెళ్లడానికి చెరువులోకి కలిపారని, దీని వలన ఇళ్లలోని బోర్లలో ఉన్న నీరు కూడా కలుషితమవుతోందని ఫిర్యాదు చేశారు. గతంలో ఉన విధంగా డ్రైనేజీ నాలా వ్యవస్థను బాగుచేసి ఎస్టీపీ ప్లాంట్‌కు వెళ్లేలా చూడాలని కోరారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరారు. భగత్‌సింగ్‌నగర్‌లో కూడా పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి

ఉప్పల్: అర్హులైన ప్రతి ఒక్కరూ అభయ హస్తం దరఖాస్తులను అందజేయాలని ఉప్పల్ డివిజన్ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ డివిజన్ పరిధిలో శాంతినగర్‌లో ప్రజాపాలన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజాపాలనను అందుబాటులోకి తీసుకువచ్చామని, ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తామని, ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ, తిక్క ప్రకాశ్, అల్వాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



ఉప్పల్ శాంతినగర్‌లో ప్రజాపాలన కేంద్రాన్ని ప్రారంభించిన కార్పొరేటర్

యాదాద్రి వరకు మెట్రో రైలును పొడిగించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఉప్పల్ నుంచి యాదాద్రి వరకు మెట్రో రైలును పొడిగించాలని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరానికి సమీపంలో ఉన్న ఘట్‌కేసర్, పోచారం, నారపల్లి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు సరిపోవడం లేదని, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి హైదరాబాద్‌కు తూర్పున అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఇరుగ్గా ఉన్న రోడ్డులో నిత్యం ప్రమాదాలు జరిగి సామాన్యుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయన్నారు. నూతన ప్రభుత్వం స్పందించి యాదాద్రి వరకు మెట్రో రైలును పొడగించాలని కోరారు.

ప్రతి దరఖాస్తుకు రసీదు అందించాలి

మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయందర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: ప్రజాపాలన కేంద్రానికి వచ్చిన ప్రతి ఒక్కరి వద్ద నుంచి చివరి దరఖాస్తు తీసుకునే వరకు సిబ్బంది అందుబాటులో ఉండాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్, ఎల్లంపేట్ గ్రామాల్లో ప్రజాపాలనలో అభయహస్తం దరఖాస్తులు స్వీకరిస్తున్న ప్రక్రియను బుధవారం తనిఖీ చేశారు. దరఖాస్తుల స్వీకరణ, పత్రాలను ఎలా నింపుతున్నారనే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పలువురు దరఖాస్తుదారులతో ఆయన మాట్లాడారు. ప్రజలు సమర్పించే ప్రతి దరఖాస్తుకు అధికారులు తప్పనిసరిగా రసీదు అందించాలని, దరఖాస్తుదారులు ఏ పథకాలకు దరఖాస్తు చేశారనే వివరాలను రసీదు ఫారంలో టిక్కులు పెట్టాలని తెలిపారు. తహశీల్దార్ శైలజ, ఎంపీడీఓ పద్మావతి, ఎంపీపీ రజితరాజుమల్లారెడ్డి, సర్పంచులు గీతాభాగ్యారెడ్డి, వెన్నెల రామకృష్ణుడు, మండల వ్యవసాయాధికారి అర్చన, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్లంపేట్‌లో వృద్ధురాలితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయందర్‌రెడ్డి

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: ప్రజాపాలనను అర్హులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి అన్నారు. కీసర మండల కేంద్రంతో పాటు చీర్యాలలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ నేత వజ్రేష్ యాదవ్, ఎంపీపీ ఇందిర లక్ష్మీనారాయణ, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, సర్పంచ్‌లు ధర్మేందర్, మాధురి, కీసర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోల కృష్ణయాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల వాగ్వాదం

శామీర్‌పేట్: శామీర్‌పేటలో బుధవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమం రసాభాసగా మారింది. మండల కేంద్రమైన శామీర్‌పేట గ్రామంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి మేడ్చల్ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జంగయ్యయాదవ్ పాల్గొన్నారు. ఈక్రమంలో అక్కడే ఉన్న సుదర్శన్, జంగయ్యయాదవ్ మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి వారికి సర్దిచెప్పారు.

ప్రజాపాలన దరఖాస్తుకు రశీదు ఇవ్వాలి

ఘట్‌కేసర్: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ తప్పకుండా రశీదు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబేలర్ అలీతో కలిసి బుధవారం పరిశీలించారు. కౌన్సిలర్లు రమాదేవి, సంగీత, ఆంజనేయులుగౌడ్, నాయకులు సిరాజ్, విమల, ఆంజనేయులు, శివ, శశికళ, ప్రేమలత, కన్యాకుమారి, మేఘమాల, సలీం, మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.



ప్రజాపాలనలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి



జంగయ్యయాదవ్ - సుదర్శన్‌ల మధ్య వాగ్వాదం



ఎన్ఎఫ్‌సీనగర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ రమాదేవి